సాక్షి
తిరుపతి
ఆదివారం । 18 । ఆగస్టు । 2024



స్వాగతం, వీడ్కోలు
ఉప రాష్ట్రపతి జగదీప్ ధంఖర్‌కు రేణిగుంట విమానాశ్రయంలో మంత్రి ఆనం ఘన స్వాగతం పలికారు. - 8లో



టీటీడీ ఈఓ తనిఖీలు
టీటీడీ ఈఓ శ్యామలరావు శనివారం తిరుమలలోని పలు ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. - 8లో



రాజకీయ పాఠం
ఎస్‌ఎంసీ ఎన్నికల్లో అధికారులు నిబంధనలను తుంగలో తొక్కిన ఘటన వెంకటగిరిలో చోటుచేసుకుంది. - 8లో

న్యూస్‌రీల్

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఏఎస్పీల బదిలీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అదనపు ఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. తిరుపతి ఏఎస్పీ జె.కులశేఖర్‌ను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు, చిత్తూరు ఏఎస్పీ ఆరీఫుల్లాకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలు జారీచేశారు. చిత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) ఏఎస్పీ ఏవీ.సుబ్బరాజును తూర్పుగోదావరి ఏఎస్పీగా నియమించింది. పుట్టపర్తి ఎస్‌ఈబీలో ఉన్న బీ.నాగభూషణరావును తిరుపతి ఏఎస్పీగా నియమించగా.. చిత్తూరుకు ఇంకా ఎవర్నీ నియమించలేదు.

అరుణాచలంకు 200 బస్సులు

తిరుపతి అర్బన్: పౌర్ణమి సందర్భంగా తిరుఅణ్ణామలైకి ఆది, సోమవారాల్లో 200 సర్వీసులను ఏర్పాటు చేసినట్టు డీపీటీఓ చెంగల్‌రెడ్డి శనివారం తెలిపారు. ఓ వైపు ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను అందిస్తూనే మరోవైపు రాబడిని పెంచుతున్నట్లు చెప్పారు. పౌర్ణమి సందర్భంగా తమిళనాడు రాష్ట్రంలోని తిరువణ్ణామలైకి రెండేళ్ల క్రితం కేవలం 2 సర్వీసులతో ప్రారంభించామని, క్రమేణా భక్తుల సౌకర్యాలను, సంఖ్యను దృష్టిలో ఉంచుకుని 200 సర్వీసులకు పెంచామని వెల్లడించారు. అరుణాచలంకు వెళ్లే సర్వీసుల్లో రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించినట్టు పేర్కొన్నారు.

లింగ సమానత్వంతోనే దేశాభివృద్ధి

తిరుపతి సిటీ: లింగ సమానత్వంతోనే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని మహిళా వర్సిటీ రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ ఈ.కోనప్రభ అభిప్రాయపడ్డారు. శనివారం పద్మావతి మహిళా వర్సిటీలో ఇంజినీరింగ్ తొలి ఏడాదిలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు లింగ వివక్షతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నప్పటికీ లింగవివక్ష మాత్రం అంతరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ ఎం.సుచరిత పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాకాల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మొహిద్దీన్‌బాషా తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ బీఎస్సీ డిగ్రీ విద్యార్థులకు భౌతికశాస్త్రం బోధించడానికి ఎంఎస్సీ ఫిజిక్స్‌లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి, పీహెచ్‌డీ గాని సీజీసీ నెట్, ఏపీసెట్ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు ఇటర్వ్యూ నిర్వహిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 6303847064 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.



తిరుపతి నగరంలో వందలాదిమంది డాక్టర్ల భారీ బైక్ ర్యాలీ

తిరుపతిలో జూడాల నిరసన గళం

ఉరిమిన ఉద్యమం!

- వైద్యవిద్యార్థిని హత్యాచార ఘటనపై పెల్లుబికిన నిరసన
- విధులు బహిష్కరించి రోడ్డెక్కిన జూడాలు
- బైక్ ర్యాలీతో దద్దరిల్లిన తిరుపతి
- ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆగిన వైద్యసేవలు
- జూనియర్ డాక్టర్ల సమ్మెకు మూకుమ్మడి మద్దతు

'డాక్టర్లకు రక్షణ కల్పించాలి. విధుల్లో ఆటంకం కలగకుండా చర్యలు తీసుకురావాలి. వైద్యవిద్యార్థినిని బలిగొన్న కామాంధులను కఠినంగా శిక్షించాలి. మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరగకుండా ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి' అంటూ జూనియర్ డాక్టర్లు నినాదాలు మిన్నంటించారు. గురువారం జిల్లా వ్యాప్తంగా వైద్యసేవలకు విరామం ప్రకటించి రోడ్లెక్కారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో వైద్యవిద్యార్థినిపై జరిగిన ఘటనకు నిరసనగా ఉద్యమబాట పట్టారు. బైక్ ర్యాలీలు చేపట్టారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని సూచించారు.

తిరుపతి తుడా: పశ్చిమబెంగాల్ రాష్ట్రం, కోల్‌కత్తాలోని ఆర్జీకర్ ప్రభుత్వాస్పత్రిలో వైద్య విద్యార్థినిని హత్యాచారం ఘటనను జూనియర్ డాక్టర్లు తీవ్రంగా ఖండించారు. శనివారం ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, వైద్య విద్యార్థులు విధులను బహిష్కరించి ఉద్యమంబాట పట్టారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు తిరుపతి జిల్లా వ్యాప్తంగా నిరసన జ్వాలలు మిన్నంటించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వీరికి మద్దతుగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యం, నర్సుల అసోసియేషన్, ఏపీ ఎన్జీవో, ఏపీ హంస, ఏఐటీయూసీ, వైఎస్సార్‌సీపీకి చెందిన నగర మేయర్ డాక్టర్ శిరీష, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, ఐఎంఏ, వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. వైద్యులు, వైద్య విద్యార్థులు రుయా ప్రాంగణంలో నిరసన దీక్షకు దిగారు. స్విమ్స్ వైద్య విద్యార్థులు, పారామెడికల్ సిబ్బంది భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. శ్రీకాళహస్తి, సత్యవేడు, గూడురు మండల కేంద్రాలతో పాటు పీహెచ్‌సీల పరిధిలోనూ నిరసనలు మిన్నంటించారు.



తిరుపతిలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న డాక్టర్లు

స్తంభించిన వైద్య సేవలు

జిల్లా వ్యాప్తంగా శనివారం వైద్య సేవలు నిలిచిపోయాయి. అత్యవసన వైద్యసేవలు మినహా ఓపీ, ఓటీ సేవలను నిలిపివేయడంతో రోగులు తిప్పలు పడాల్సి వచ్చింది.

దద్దరిల్లిన తిరుపతి

జూనియర్ డాక్టర్ల నిరసనలతో తిరుపతి దద్దరిల్లింది. స్విమ్స్ వైద్యులు, వైద్య విద్యార్థులు భారీ బైక్ ర్యాలీగా రుయా ప్రాంగణానికి చేరుకున్నారు. అక్కడి నుంచి వివేకానంద కూడలి, స్విమ్స్ కూడలి, టౌన్‌క్లబ్, బాలాజీ కాలనీ, ఎస్వీ యూనివర్సిటీ నుంచి స్విమ్స్ ఆస్పత్రి, మెటర్నటీ మీదుగా రుయా వరకు బైక్ ర్యాలీ సాగింది.

ప్రత్యేక చట్టం అవసరం





వైద్య విద్యార్థిని పట్ల క్రూరంగా వ్యవహరించిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలి. వైద్యుల పట్ల దాడులను, ఇలాంటి అత్యాచార ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రత్యేకచట్టం తీసుకురావాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లతెరిచి కఠినమైన చట్టాలను తీసుకురావాలి.

– ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష

కొవ్వొత్తుల ర్యాలీ

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ ఉమెన్ సేఫ్టీ సెంటర్, మహిళా అధ్యయనశాఖ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అధ్యాపకులు మాట్లాడుతూ బాలికలు, మహిళలపై లైంగికదాడులు, హింసలు, హత్యలు జరగడం దారుణమన్నారు. డీన్లు వాణి, సుజాతమ్మ, వార్డెన్ సావిత్రి, ఉమెన్ సేఫ్టీ సెంటర్ డైరెక్టర్ సీతాకుమారి, డాక్టర్ నీరజ పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు, అధ్యాపకులు

ఇది తప్పలేదా గోవిందా?

- గతంలో తిరుపతి మాస్టర్‌ప్లాన్ రోడ్లుకు టీటీడీ నిధులిస్తే తప్పని గగ్గోలు
- ఇప్పుడు చంద్రగిరి రోడ్లకు విచ్చలవిడిగా నిధులిచ్చేందుకు కసరత్తు
- నిధుల కోసం సీఎంకి చంద్రగిరి ఎమ్మెల్యే లేఖ
- పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని టీటీడీ ఈఓకి ఆదేశం
- ప్రభుత్వ ఆదేశాలపై విస్మయం వ్యక్తం చేస్తున్న టీటీడీ ఉద్యోగులు



'మీరు చేస్తే తప్పు.. మేం చేస్తే ఒప్పు' అన్నట్టుంది కూటమి నేతల తీరు. గత ప్రభుత్వ హయాంలో తిరుమలలో భాగమైన తిరుపతి మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధికి టీటీడీ నిధులు కేటాయించింది. దీనిపై అప్పట్లో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు రద్ధాంతం చేశారు. ఇప్పుడు అదే టీటీడీ నిధులను తిరుమలతో ఎలాంటి పంబంధం లేని చంద్రగిరి నియోజకవర్గ రోడ్ల అభివృద్ధికి కేటాయించాలని నిర్ణయించడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో నిధులు కేటాయిస్తే తప్పయితే.. ఇప్పుడు ఎలా ఒప్పవుతుందో ఆ గోవిందుడికే ఎరుకని చర్చించుకుంటున్నారు.

సాక్షి ప్రతినిధి, తిరుపతి: ఆధ్యాత్మిక నగరమైన తిరుపతి మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణానికి గతంలో కార్పొరేషన్‌తోపాటు టీటీడీ నిధులు వెచ్చించడంపై అప్పటి టీడీపీ, జనసేన నేతలు గగ్గోలు పెట్టారు. ఇప్పుడు చంద్రగిరి పరిధిలో రహదారుల పునఃనిర్మాణానికి టీటీడీ నిధులు కేటాయింపుపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తిరుమలలో భాగమైన తిరుపతి నగర అభివృద్ధికి టీటీడీ నిధులిస్తే తప్పయితే.. టీటీడీతో సంబంధమే లేని చంద్రగిరి అభివృద్ధికి నిధులిస్తే ఒప్పవుతుందా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

తిరుమల అంటేనే తిరుపతి. అందుకే తిరుమల తిరుపతి దేవస్థానం అంటారు. తిరుమలకు చేరుకునే భక్తులు ముందుగా తిరుపతిలో దిగుతారు. తిరుపతి నుంచే తిరుమలకు వెళ్లి వస్తుంటారు. తిరుపతిలో శ్రీవారి భక్తుల సౌకర్యం కోసం అప్పటి టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి సహకారంతో 18 మాస్టర్ ప్లాన్ రోడ్లను నిర్మించారు. ఈ రోడ్లకు కార్పొరేషన్‌తో పాటు టీటీడీ నుంచి కొంత నిధులను కేటాయించారు. దీనిపై అప్పటి టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు తీవ్ర రాద్ధాంతం చేశారు. వారి అనుకూల మీడియా కూడా మాస్టర్ ప్లాన్ రోడ్లపై అసత్య కథనాలు వండి వార్చింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే.. ప్రక్షాళన పేరుతో రహదారుల నిర్మాణానికి టీటీడీ నిధులు కేటాయించడంపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఆ వెంటనే 40 మంది విజిలెన్స్ అధికారుల బృందాన్ని రంగంలోకి దింపింది. తిరుమల, తిరుపతిలో సుమారు నెల రోజుల పాటు ఫైళ్లన్నీ తవ్వారు. మాస్టర్ ప్లాన్ రోడ్లకు సంబంధించి టీటీడీలోని 75 మంది ఇంజినీర్లకు నోటీసులు జారీచేశారు. మాస్టర్ ప్లాన్ రోడ్లతో పాటు పలు ఇంజినీరింగ్ పనులకు అనుమతులు ఇవ్వడాన్ని తప్పుబడుతూ నోటీసులు జారీచేసి వేధింపులకు దిగారు. నోటీసులు అందుకున్న ఇంజినీర్లు ఇంకా వివరణ కూడా ఇవ్వకముందే కూటమి ప్రభుత్వం నుంచి టీటీడీ ఈఓకు ఓ ఆదేశం జారీ అయ్యింది. చంద్రగిరి నియోజకవర్గంలోని రహదారులను టీటీడీ నిధులతో పునఃనిర్మించే విషయమై నిర్ణయం తీసుకోవాలని సూచించింది. దీనిపై ఇంజినీరింగ్ అధికారుల్లో అయోమయం నెలకొంది. నాడు చేసింది తప్పయితే.. నేడు అదే పని చేయమంటూ తమకు ఆదేశాలిస్తే ఎలా చేయగలమని ప్రశ్నిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేసింది తప్పని వాదించిన కూటమి నేతలు ఇప్పుడు తమ నిర్ణయాన్ని ఎలా సమర్థించుకుంటారని తిరుపతి నగరవాసులతో పాటు శ్రీవారి భక్తులు ప్రశ్నిస్తున్నారు.

రోడ్లేయాలి..నిధులిప్పించండి!

చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని తిరుపతి- చిగురువాడ, తిరుపతి- తనపల్లి, తిరుచానూరు- పూడి, రంగంపేట- ఐతేపల్లి రహదారులు దెబ్బతిన్నాయని, వీటిని టీటీడీ నిధులతో పునఃనిర్మించాలని కోరుతూ చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఇటీవల సీఎం చంద్రబాబు నాయుడుకి లేఖ రాశారు. దీనిపై స్పందించిన కూటమి ప్రభుత్వం పులివర్తి నాని సూచించిన రోడ్ల నిర్మాణ విషయంపై పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని టీటీడీ ఈఓకు ఆదేశాలు జారీచేసింది. దీనిపై ఇటీవలే విజిలెన్స్ అధికారుల నుంచి నోటీసులు అందుకున్న టీటీడీ ఇంజినీర్లు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఏ కారణాలు చూపుతూ తమకు నోటీసులు జారీ చేశారో, అదే పని చేయమంటూ ఇప్పుడు తమకు ఆదేశాలిస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు.



వేద రామాయణం!

- అయోధ్య రాముడి ఆలయంలో అర్చకులుగా వేదిక్ వర్సిటీ విద్యార్థులు
- కఠోర పరీక్షల్లో నెగ్గి కొలువు సాధించిన మోహిత్, మయాంక్
- వర్సిటీ వాతావరణం, అధ్యాపకుల ప్రోత్సాహంతోనే లక్ష్యం సాధ్యం

వేద విజ్ఞానాన్ని అవపోసన పట్టేశారు. ఎంచుకున్న కోర్సుల్లో అత్యుత్తమంగా రాణించి మెప్పించారు. వర్సిటీ అందించిన సహకారం, అధ్యాపకుల ప్రోత్సాహంతో సమోన్నతంగా ఎదిగారు. కఠోర సాధనకు తోడు సడలని సంకల్పంతో పోటీపరీక్షలను అవలీలగా దాటేశారు. దేశంలోనే అత్యున్నత ఆలయమైన అయోధ్య రామాలయంలో అర్చకత్వంలో స్థిరపడ్డారు. నిత్యం రామనామాన్ని జపిస్తూ.. జీవితాన్ని సార్థకం చేసుకుంటున్నారు. సంకల్పం, పట్టుదల ఉంటే ఏదైనా సాధించొచ్చని నిరూపించారు.. తిరుపతి వేదిక్ వర్సిటీ విద్యార్థులు మోహిత్‌పాండే, మయాంక్ త్రిపాఠి.

తిరుపతి సిటీ: టీటీడీ ఆధ్వర్యంలో 2006లో వేద విజ్ఞానాన్ని విశ్వవ్యాప్తం చేసే లక్ష్యంతో ఎస్వీ వేదిక్ యూనివర్సిటీని ఏర్పాటు చేశారు. ఇక్కడ సుమారు 21 విభాగాలలో శాస్త్ర, ఆచార్య, పీహెచ్‌డీ, డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సులను అందిస్తున్నారు. ప్రస్తుతం టీటీడీలోనే కాకుండా దేశవిదేశాల్లోని ఆలయాల్లో పలు హోదాల్లో వేదిక్ వర్సిటీ విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. వర్సిటీలో కోర్సులు పూర్తి చేసుకున్న ప్రతి విద్యార్థీ వంద శాతం ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. దేశంలో ఈ స్థాయి ఉన్నత విద్యను అందిస్తున్న సంస్థకానీ, విశ్వవిద్యాలయంగానీ మరొకటి లేదనడంలో అతిసయోక్తికాదు.



వేదిక్ వర్సిటీలో వేద విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు

విద్యపైనే ధ్యాస

మా సొంతూరు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని శీతాపూర్‌పట్నం. అమ్మానాన్న వ్యవసాయ కూలీలు. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే. వేద విద్యలో డిగ్రీ, పీజీ చేయాలనే ఆశయం ఉండేది. టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో సీటు సంపాదించి బీఏ (శాస్త్రీయ) సామవేదం విభాగంలో చేరాను. అధ్యాపకుల మార్గదర్శకంలో ప్రథమ శ్రేణిలో సామవేదంలో 2023లో బీఏ డిగ్రీ సాధించాను. పీజీ (ఆచార్య)లో మొదటి ఏడాది అడ్మిషన్ పొందిన వెంటనే అయోధ్య రామమందిరంలో శాశ్వత ప్రాతిపదికన 20 అర్చక పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. దేశ వ్యాప్తంగా సుమారు 6 వేల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. కఠోర శ్రమతో 6 వేల మందితో పోటీపడి ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం రామమందిరంలో శాశ్వత అర్చకునిగా పనిచేస్తున్నాను. రోజుకు 6 నుంచి 8 గంటల వరకు విధులు నిర్వహిస్తున్నా. కటింగ్స్ పోను రూ.40 వేల వరకు జీతం వస్తోంది. మాకు కావలసి వసతి, భోజన సౌకర్యాలు అన్నీ ఉచితం. ఈ స్థాయికి చేర్చిన వర్సిటీకి, అధ్యాపకులకు రుణపడి ఉంటా.

– మోహిత్‌పాండే, అర్చకులు, అయోధ్య రామాలయం, యూపీ

వేద విజ్ఞానం అందించమే లక్ష్యం



పూర్తి స్థాయి వేద విజ్ఞానాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. మోహిత్ పాండే, మయాంక్ త్రిపాఠి అర్చకత్వంలో స్థిరపడ్డం వేదిక్ వర్సిటీకి దక్కిన గౌరవంగా భావిస్తున్నా.

– ప్రొఫెసర్ రాణి సదాశివమూర్తి, వీసీ, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం

ప్రపంచ స్థాయిలో వర్సిటీకి గుర్తింపు



వేద విద్యనభ్యసించి అయోధ్య రామాలయంలో కొలువు సాధించడం అంత సులువైన ప్రక్రియ కాదు. అలాంటిది మా శిష్యులు సాధించారు. గర్వపడుతున్నాం.

– డాక్టర్ గిరిజా ప్రసాద్ షడంగి, సామవేద విభాగాధ్యక్షులు



క్రమశిక్షణతో విద్యనభ్యసించా

అయోధ్య రామాలయంలో ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నా. దీనికోసం క్రమశిక్షణతో అధ్యాపకుల సలహాలతో విద్యనభ్యసించా. మాది ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్య పట్టణం. నాన్న వృత్తి రీత్యా పౌరోహిత్యం (కర్మకాండ) చేస్తుంటారు. వచ్చే ఆదాయం కుటుంబ పోషణకే చాలేది కాదు. నేను వేద విద్యను పూర్తిస్థాయిలో చదవాలని నాన్నకు కోరిక ఉండేది. ఎస్వీ వేదిక్ వర్సిటీలో శుక్ల యజుర్వేదంలో బీఏ (శాస్త్రీయ) కోర్సులో 2020లో చేరి 2023లో పూర్తి చేశాను. తిరుపతి వేదిక్ వర్సిటీ వేద విద్యకు పెట్టింది పేరు. ఉదయం నిద్రలేచినప్పటి నుంచి రాత్రి నిద్రపోయేవరకు వర్సిటీలో వేద విద్య తప్ప వేరే ధ్యాస ఉండదు. అయోధ్య రామాలయంలో అర్చక ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల కాగానే దరఖాస్తు చేసుకుని ఉద్యోగం సాధించా. నాన్న కోరిక నెరవేర్చా. నా కాళ్లపై నేను నిలబడ్డా. ప్రధాన ఆలయంలోని కోందడరాముని చెంత అర్చక వృత్తితో నా జీవితం ధన్యమైంది.

–మయాంక్ త్రిపాఠి, అర్చకులు, అయోధ్యరామాలయం, యూపీ

క్లుప్తంగా

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 62,625 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 34,462 మంది తలనీలాలు సమర్పించారు. స్వామికి కానుకల రూపంలో హుండీలో రూ.3.63 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 24 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

రేపటి నుంచి చివరి విడత ఈఏపీసెట్ కౌన్సెలింగ్

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం నుంచి ఈఏపీసెట్-2024 చివరి విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇదివరకు నిర్వహించిన రెండు విడతల కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 19 నుంచి 21వ తేదీలోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని 20 నుంచి 23వ తేదీలోపు ఆప్షన్స్ నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 26న అలాట్‌మెంట్, 30వ తేదీలోపు కళాశాలల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో శనివారం యాంటీ ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వర్సిటీ యాంటీ ర్యాగింగ్ నోడల్ అధికారిణి డీ.జ్యోతి మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు జూనియర్లతో సోదరభావంతో మెలగాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోస్టర్లను ఆవిష్కరించారు. డాక్టర్ మేరీ సుజాత, డాక్టర్ జే బలిచక్రవర్తి, పరిమితాపాండా, లక్ష్మీనారాయణ, లోకేశ్వర్ పాల్గొన్నారు.

నేడు మూన్-ఇండియన్ మూన్ మిషన్‌పై క్విజ్

తిరుపతి(అలిపిరి): దేశ తొలి జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం(సైన్స్ సెంటర్)లో తిరుపతి ఆకాశవాణితో కలిసి 'మూన్ - ఇండియన్ మూన్ మిషన్స్' అనే అంశంపై ఓపెన్ హౌస్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ తెలిపారు. ఈ వారం అనంతరం ఆకాశవాణి తిరుపతిలో ఎఫ్ఎం 103.2 - 107.5లో రేడియో క్విజ్ ప్రసారం చేస్తామని పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే క్విజ్ పోటీల్లో పాఠశాల, కళాశాల విద్యార్థులు, సాధారణ ప్రజలు పాల్గొనవచ్చని వెల్లడించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సీఐల బదిలీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు, తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు వీఆర్‌లో ఉన్న ఎస్.విశ్వనాథరెడ్డిని రాయచోటి ట్రాఫిక్‌కు, ఐ.రవిశంకర్‌రెడ్డిని అన్నమయ్య దిశాకు, తిరుపతి వీఆర్‌లో ఉన్న బి.రాఘవరెడ్డిని అన్నమయ్య ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధక విభాగం, కుప్పంలో పని చేసి చిత్తూరు సీసీఎస్‌కు వచ్చిన టి.శ్రీధర్‌కు ఆ పోస్టింగ్‌ను రద్దు చేస్తూ వీఆర్‌కు ఆదేశించారు.

అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి



సమావేశానికి హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఏర్పేడు: విద్యార్థులు అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించాలని ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్.సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం ఏర్పేడు మండలంలోని ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో నవ ఆవిష్కర్ టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో ముందస్తు జాతీయ అంతరిక్ష పరిశోధన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్‌పట్ల మరింత ఆసక్తి కలిగిస్తున్నట్లు వివరించారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎన్నో సేవందించిన అబ్దుల్ కలాం లాంటి వ్యక్తులను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ నెల 23న జాతీయ అంతరిక్ష పరిశోధన దినోత్సవం సందర్భంగా అప్పటి వరకు ఐఐటీలో వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. శ్రీహరికోట ఇస్రో నుంచి ఎన్నో అంతరిక్ష ప్రయోగాలు చేసినట్లు గుర్తుచేశారు. ఇలాంటి కార్యక్రమాలు విద్య, వైజ్ఞానిక మనస్తత్వ కలయికగా ఆయన అభివర్ణించారు. యవతరంలో ఆవిష్కరణలు, ఉత్సుకతను పెంపొందించడం, అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానం, విద్యాసంస్థల పాత్ర తదితర అంశాలపై వివరించారు. ఇలాంటి సంఘటనలు అంతరిక్ష పరిశోధనలో భారతదేశం సాధించిన విజయాలను జరుపుకోవడమే కాకుండా భవిష్యత్ శాస్త్రవేత్తలు, ఇంజినీర్లను దేశ అంతరిక్ష ప్రయోగాలకు దోహదపడేలా ప్రేరేపిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో శ్రీహరికోట ఎస్‌డీఎస్‌సీ సాలిడ్ మోటార్స్ ప్రొపెల్లెంట్ కాంప్లెక్స్ చీఫ్ జనరల్ మేనేజర్ డాక్టర్ టీవీ రమణారెడ్డి, బెంగళూరు ఇస్రో కార్యాలయ శాటిలైట్ నావిగేషన్ ప్రోగ్రాం, ఆఫీస్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ మనీష్ సక్సేనా, రోషన్‌శ్రీవత్సవ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

సీఎం పర్యటన ఏర్పాట్లు

శ్రీసిటీ(వరదయ్యపాళెం): శ్రీ సిటీ పారిశ్రామిక వాడకు ఈనెల 19న సీఎం చంద్రబాబు నాయుడు రానున్న నేపథ్యంలో శ్రీ సిటీ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సంయుక్తంగా ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ సుభంబన్సల్, సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్‌కుమార్, ఇతర రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది, ఆర్అండ్‌బీ అధికారులు శనివారం అక్కడే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. హెలిప్యాడ్, శ్రీ సిటీలో సీఎం హాజరుకానున్న బిజినెస్ సెంటర్ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడ బ్యారికేడ్లు ఇతర ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు.



శ్రీసిటీ బిజినెస్ సెంటర్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లను సద్వినియోగం చేసుకోండి

చంద్రగిరి: మధ్యలో చదువు మానేసిన, పదో తరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు ఏపీ సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్ స్కూల్) విధానంలో అడ్మిషన్ పొంది మళ్లీ చదువుకోవచ్చని స్టేట్ ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ నాగేంద్రరావు తెలిపారు. ఆయన శనివారం స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ 10వ తరగతి, ఇంటర్ ఫెయిల్, మధ్యలో నిలిచిపోయిన లేదా రెగ్యులర్‌గా పరీక్ష రాసి ఫెయిల్ అయిన విద్యార్థులు కూడా ఓపెన్ స్కూల్ అడ్మిషన్లను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ గురుస్వామి రెడ్డి మాట్లాడుతూ ఏదైనా సబ్జెక్టులో ఫెయిల్ అయినా ఓపెన్ స్కూల్ ద్వారా పరీక్షలు రాసి పాసై రెగ్యులర్ వారి మాదిరిగా సర్టిఫికెట్ పొందవచ్చని తెలియజేశారు. ఎంఈవోలు భాస్కర్ బాబు, లలిత కుమారి పాల్గొన్నారు.

భవనంపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ, దొడ్లమిట్టకు చెందిన చాపల మునెయ్య ముదిరాజ్(62) భవనంపై గొడకు నీళ్లు పడుతూ ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. వివరాలు.. దొడ్లమిట్ట గ్రామానికి చెందిన చాపల మునెయ్య ముదిరాజ్ ఇంటిపై ఇంకో అంతస్తు నిర్మిస్తున్నాడు. ఉదయం గోడలకు నీరు పడుతుండగా ప్రమాదవ శాత్తు కాలుజారి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కరకంబాడి అమర హాస్పిటల్‌కి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆయన చికిత్స పొందుతూ మృతి చెందాడు. మల్లిమడుగు రిజర్వాయర్ మత్స్య సహకార సంఘం మాజీ చైర్మన్‌గా ఆయన పనిచేశారు.



మృతుడు మునెయ్య ముదిరాజ్(ఫైల్)

ఉరేసుకుని వ్యక్తి..

చంద్రగిరి: ఉరేవేసుకుని వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి కల్‌రోడ్డుపల్లి సమీపంలోని కొత్త ఇండ్లు బస్టాప్ వద్ద శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తమిళనాడు తంజావూరుకు చెందిన వరదరాజన్(41) శనివారం తెల్లవారుజామున కొత్తఇండ్లు జాతీయ రహదారి వద్ద ఉన్న బస్టాప్‌కు ఉరివేసుకుని మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు లారీ డ్రైవర్‌గా గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నదర్యాప్తులో ఉంది.

ఐషర్‌ను ఢీకొన్న లారీ

చంద్రగిరి: ఐషర్ వాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు గాయాలపాలైన ఘటన పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి కల్‌రోడ్డుపల్లి వద్ద శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. విజయవాడ నుంచి బెంగళూరుకు వెళ్తున్న ఐషర్ వాహనం టైరు పంక్చర్ కావడంతో డ్రైవరు టైరును మారుస్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి మరో లారీ ఐషర్ వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహనాలు దెబ్బతినగా, ఇద్దరి డ్రైవర్లు గాయపడ్డారు.



దెబతిన్న లారీ

ఎపిలెప్సీ క్యాంపు వాయిదా

తిరుపతి తుడా : స్విమ్స్ ఆస్పత్రిలో ప్రతి నెలా మూడో ఆదివారం నిర్వహించే ఎపిలెప్సీ (ఉచిత మందుల పంపిణీ) క్యాంపును వాయిదా వేస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన అమానుష ఘటనను వ్యతిరేకిస్తూ ఇండియన్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు రెండు రోజుల పాటు డాక్టర్లు, సిబ్బంది సమ్మెలో ఉన్నట్టు తెలిపారు. రోగులు సహకరించాలని కోరారు.

ఎస్ఎంసీ ఎన్నికల్లో రాజకీయ పాఠం!

- కోరం లేకపోయినా అధికార పార్టీ మహిళకు చైర్మన్ పదవిని కట్టబెట్టిన విద్యాశాఖ అధికారులు

వెంకటగిరి రూరల్: ఎస్ఎంసీ ఎన్నికల్లో రాజకీయ రగడ చోటు చేసుకుంది. కోరం లేకపోయినా అధికార పార్టీ మహిళకు పట్టం కట్టేందుకు అధికారులు ఎత్తుగడ వేసి విజయం సాధించారు. ఈ ఘటన వెంకటగిరి పట్టణంలోని విశ్వోదయ కళాశాల ప్రాగంణంలో ఉన్న మహాత్మాగాంధీ జ్యోతీరావు పూలే బీసీ బాలుర పాఠశాలలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. పాఠశాల ప్రిన్సిపల్ పాండురంగయ్య నేతృత్వంలో శనివారం ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. పాఠశాలలో అన్ని తరగతులకు సంబంధించి 18 మంది ఎస్ఎంసీ కమిటీ సభ్యులు ఎన్నుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో వెంకటగిరి రూరల్ మండలం, పాళెంకోటకు చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు రవిశంకర్, డక్కిలి మండలం, నాగలపాడు గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతి మహిళ మౌనిక ఎస్ఎంసీ చైర్మన్ బరిలో నిలిచారు. అయితే ఉదయం 11.30 గంటల సమయంలో మౌనికకు మద్దతు తెలిపేందుకు నలుగురు వ్యక్తులు అంగీకరించగా.. మిగిలిన వారు ఎస్ఎంసీ చైర్మన్‌గా రవిశంకర్‌ను బలపరిచారు. స్థానిక టీడీపీ నేతలు జోక్యం చేసుకుని ఎన్నికలను వాయిదా వేసేయత్నం చేశారు. అక్కడికొచ్చిన మిడియా ప్రతినిధులను పాఠశాల వద్దకు వెళ్లకుండా ఎంఈఓలు వెంకటేశ్వరరావు, బాబయ్య అడ్డుకున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలు అయినా ఎన్నికలు నిర్వహించకపోగా సాయంత్రం 3.30 గంటలకు వరకు వేచి ఉన్న చైర్మన్ అభ్యర్థి రవిశంకర్, కమిటీ సభ్యులు ఎన్నికలు జరిగే హాలు నుంచి బయటకు వచ్చేశారు. అనంతరం అధికారులు కోరం లేకపోయినా డక్కిలి మండలం, నాగలపాడు గ్రామానికి చెందిన మౌనికను చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా శివకుమార్, ఎక్స్ అఫిషియో సభ్యులుగా నారిశేఖర్, కో- ఆప్షన్ సభ్యులుగా సత్యనారాయణ, చంద్రయ్యను ఎన్నుకున్నారు. అనంతరం అధికారులు వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు.



ఎన్నికల నిర్వహణ కోసం వేచి ఉన్న సభ్యులు

భారత ఉప రాష్ట్రపతికి స్వాగతం, వీడ్కోలు

రేణిగుంట: భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధంఖర్ దంపతులకు రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శనివారం రేణిగుంట విమానాశ్రయంలో స్వాగతం పలికారు. నెల్లూరు జిల్లా పర్యటన నిమిత్తం విచ్చేసిన ఆయనకు విమానాశ్రయంలో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఐజీ రాజీవ్‌కుమార్‌మీనా, డీఐజీ షిమోషిబాజీపాయ్, ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీషా, మున్సిపల్ కమిషనర్ నారపురెడ్డిమౌర్య తదితర స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ఆయన నెల్లూరు జిల్లాలోని అక్షర విద్యాలయ క్యాంపస్, స్కిల్ డెవలప్మెంట్ కేంద్రం, స్వర్ణ భారత ట్రస్ట్ 23వ వార్షికోత్సవంలో పాల్గొనేందుకు హెలికాప్టర్‌లో బయల్దేరి వెళ్లారు. వీరి వెంట మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కూడా ఉన్నారు.





స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, తిరుపతి మేయర్ డాక్టర్ శిరీషా సాదర వీడ్కోలు

నెల్లూరు జిల్లా పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 2.08 గంటలకు చేరుకున్న ఉపరాష్ట్రపతికి మంత్రి రామనారాయణరెడ్డితోపాటు జిల్లా అధికారులు వీడ్కోలు పలికారు. మధ్యాహ్నం 2.22గంటలకు ఆయన ఇక్కడి నుంచి తిరుగుపయనమయ్యారు.

తిరుమలలో టీటీడీ ఈవో తనిఖీలు



వసతి గదుల రిజర్వేషన్ టోకెన్లను పరిశీలిస్తున్న ఈవో శ్యామలరావు

తిరుమల: టీటీడీ ఈవో జె.శ్యామలరావు, అడిషనల్ ఈవో సీహెచ్.వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్ శనివారం తిరుమలలోని సప్తగిరి సత్రాలు, సీఆర్ఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సప్తగిరి సత్రాల వద్ద కారిడార్లు, బాత్‌రూమ్‌లలో శుభ్రత, స్విచ్‌బోర్డులు, జలప్రసాదం, పరుపులు, మంచాలు, బెడ్‌షీట్లను పరిశీలించారు. గదుల ఆధునీకరణ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సెంట్రల్ రిసెప్షన్ కార్యాలయంలో భక్తులకు గదుల కేటాయింపును ఆయన పరిశీలించారు. ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డు, ఇన్ఫర్మేషన్ కియోస్కలను తనిఖీ చేయడంతో పాటు కర్ణాటక, కళ్లకురిచి నుంచి వచ్చిన భక్తులతో మాట్లాడారు. తిరుమలలో అందుబాటులో ఉన్న గదులు, పీఏసీలో లాకర్ల వివరాలను ఎప్పటికప్పుడు ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. వాటి లభ్యతను బట్టి అవసరమున్న భక్తులకు కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ 2 సత్యనారాయణ, ఈఈలు వేణుగోపాల్, శ్రీనివాసులు, డీఈ (ఎలక్ట్రికల్) చంద్రశేఖర్, డిప్యూటీ ఈవోఆర్ 2 హరీంద్రనాథ్, వీజీవోలు రామ్‌కుమార్, సురేంద్ర, ఏఈవో నాయుడు పాల్గొన్నారు.

'ఎస్వీయూలో పచ్చదనం, పరిశుభ్రత' ప్రారంభం

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ప్రతి మూడో శనివారం పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు రిజిస్ట్రార్ భూపతినాయుడు తెలిపారు. ఆయన శనివారం వర్సిటీ ఆవరణలో పలు విభాగాల విద్యార్థులు, అధ్యాపకులు చేపట్టిన పరిశుభ్రత కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్సిటీ ప్రాంగణంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సమీకరించి రీసైక్లింగ్ యూనిట్‌కు తరలించాలని సూచించారు. తద్వారా క్యాంపస్‌లో పరిశుభ్ర వాతావరణం ఏర్పడుతుందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి వర్సిటీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు పీసీ వెంకటేశ్వర్లు, భాస్కర్ రెడ్డి, వివేక్, రాంబాబు, విజయ్‌కుమార్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అధ్యాపకులతో చర్చిస్తున్న రిజిస్ట్రార్ భూపతినాయుడు

నా సంతకం ఎలా పెడతారు?

– హెచ్‌ఎంను నిలదీసిన కార్పొరేటర్

తిరుపతి ఎడ్యుకేషన్: 'నా అనుమతి లేకుండా, కనీసం సమాచారం ఇవ్వకుండా నా సంతకం ఎలా పెడతారు'అంటూ కార్పొరేటర్ తూకివాకం శాలినిరెడ్డి ప్రధానోపాధ్యాయున్ని నిలదీశారు. వివరాల్లోకి వెళితే.. తిరుపతి బైరాగిపట్టెడలోని మహాత్మాగాంధీ నగరపాలక ఉన్నత పాఠశాలలో ఇటీవల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఈ ఎస్ఎంసీ కమిటీలో స్థానిక వార్డు సభ్యులు, కౌన్సిలర్, కార్పొరేటర్ ఎక్స్ అఫిషియో మెంబర్‌గా వ్యవహరిస్తారు. ఎన్నికైన సభ్యుల వివరాలు, వారి సంతకాలతో కూడిన జాబితాను విద్యాశాఖకు అధికారులకు అందించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఆ జాబితాలో ఎక్స్ అఫిషియో సభ్యురాలైన స్థానిక కార్పొరేటర్ తూకివాకం శాలినిరెడ్డి సంతకాన్ని హెచ్‌ఎం మురుగన్ తీసుకోకుండా ఆమె పేరును రాసి ఉన్నతాధికారులకు పంపించారు. ఈ విషయం ఆలస్యంగా తెలుసుకున్న కార్పొరేటర్ శనివారం పాఠశాలకు వెళ్లి తన సంతకాన్ని ఎలా ఫోర్జరీ చేస్తారంటూ హెచ్‌ఎంను నిలదీశారు. అత్యవసరంగా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాల్సి ఉండడంతో తానే మీ పేరును రాసి ఉన్నతాధికారులకు పంపించానంటూ హెచ్‌ఎం చెప్పడంతో కార్పొరేటర్ ఖంగుతిన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పే గురువు స్థానంలో ఉన్న మీరు సంతకాన్ని ఫోర్జరీ చేయడం హాస్యాస్పదంగా ఉందని, దీనిపై విద్యాశాఖాధికారులు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానంటూ కార్పొరేటర్ హెచ్చరించారు.





హెచ్‌ఎంను నిలదీస్తున్న కార్పొరేటర్ శాలినిరెడ్డి, ఫోర్జరీ సంతకం ఉన్న జాబితా